సాక్షి
జనగామ
శుక్రవారం । 11 ఏప్రిల్ । 2025



కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. - 8లో▸



డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పలు కాలేజీలు పరీక్షల నిర్వహణకు సిద్ధంగాలేవు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 / 27^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

వణికిస్తున్న వరుణుడు



జనగామ మార్కెట్ ఐకేపీ సెంటర్‌లో వర్షపునీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం



కొట్టుకుపోతున్న ధాన్యాన్ని దగ్గరకు చేర్చుతున్న మహిళ

- ఉదయం ఎండలు.. సాయంత్రం గాలులు
- ముమ్మరంగా కోతలు.. కల్లాల్లో ధాన్యం
- జిల్లాలో తగ్గిన దిగుబడి..
- మార్కెట్‌లో తడిసిన ధాన్యం

జనగామ: రైతన్నలకు వరుణుడు వణుకుపుట్టిస్తున్నాడు. యాసంగి సీజన్‌లో కరువు నష్టాన్ని మిగిలిచ్చి.. ఉన్న కాసింత పంటను అమ్ముకుందామంటే ప్రకృతి కన్నెర్ర చేస్తూ ఆగం చేస్తోంది. గాలి దుమారం, అకాల వర్షం భయంతో పచ్చిమీదనే రైతులు పంటను కోస్తున్నారు. తీరా.. పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వెళితే.. వర్షం భయం వెంటాడుతోంది. గడిచిన మూడు రోజులుగా గాలి దుమారం, చిరుజల్లులతో అన్నదాతలు అతలాకుతలం అవుతున్నారు.

వాతావరణ మార్పులు..

ఎండాకాలంలో వాతావరణం గతితప్పిందా అన్నట్లుగా.. పరిస్థితులు మారుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 38 డిగ్రీల ఉష్ణోగ్రతలతో భగ్గున మండిపోతుండగా, సాయంకాలం వాతావరణం చల్లబడిపోతుంది. దీంతో కోతకోసి మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం ఎండిన తర్వాత, మళ్లీ తడుస్తుంది. దీంతో క్వింటా ధాన్యం రూ.200 నుంచి రూ.400 తక్కువకు విక్రయించే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తగ్గిన దిగుబడి..

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.80లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు, ఎండిన చెరువులతో భూగర్భ జలాలు అడుగంటి 30 శాతం మేర పంటలు ఎండిపోయాయి. దీంతో దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం చాలాచోట్ల మరో పదిరోజుల తర్వాత కోతలు మొదలు పెట్టాల్సి ఉంది. కానీ అకాల వర్షం భయంతో పచ్చి కోతలు చేపట్టడంతో సరాసరి మిగులుబాటు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

జనగామ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

జిల్లాలో గురువారం కురిసిన వర్షంతో కల్లాలు, మార్కెట్‌లో ఉన్న ధాన్యం తడిసింది. జనగామ మార్కెట్‌తోపాటు కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం రాసులు తడిసి పోగా, కొంతమేర ధాన్యం కొట్టుకుపోయింది. వరదలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులుపడ్డారు. గాలిదుమారం ప్రారంభం కాగానే, ధాన్యం రాసులపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచినా, స్వల్ప నష్టం జరిగింది. పొద్దంతా ఎండిన ధాన్యం తడిసిపోవడంతో తేమ శాతం పెరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



పచ్చి పంటను కోస్తున్న యంత్రం

బండపై ధాన్యాన్ని ఆరబోశా..



మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశా. సుమారు రూ.75వేలకు పైగా పెట్టుబడి పెట్టిన. సాగునీరు అందక 25 శాతంమేర నష్టపోగా, ఉన్న పంటకు నీటిని అద్దెకు తీసుకుని కాపాడాను. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పచ్చిమీదనే పంట కోసిన. ధాన్యాన్ని బండపై ఆరబోశాను. మబ్బులు చూస్తుంటే గుబులు పుడుతుంది.

- సముద్రాల యాకయ్య, రైతు, జఫర్‌గఢ్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

జనగామ: జిల్లా హెడ్ పోస్టాఫీసు ఏరియా సంతోషిమాత, ఆంజనేయస్వామి ఆలయ మహారాజ గోపుర, ధ్వజస్తంభ, పరివార సమేత, విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వేద పురాణం మహేశ్వరశర్మ పర్యవేక్షణలో ఈ నెల10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న పూజా కార్యక్రమాలను మొదలు పెట్టారు. మొదటి రోజు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాలకు పూజలు చేశారు. 11వ తేదీన గోపూజ, గురువందనం, పుణ్యాహవచనం, అరణి మధనం, యాగశాల ప్రవేశం, గణేష హోమం, స్థాపిత దేవతా పూజలు, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 12న స్థాపిత దేవతాపూజలు, విగ్రహాలకు స్నపనం, ధాన్యాధివాసం, ప్రదోషకాల పూజలు, రాజోపచారాలు, 13న హవనములు, శయాధివాస, ఫలనుష్పాధివాస, హిరణ్యాధివాసములు, 14న ప్రతిష్ఠాంగ హోమాలు, గర్త న్యాసం, పిండికాస్థాపన, మూర్తి స్థాపన, స్వాతి నక్షత్ర మిథున లగ్న ముహూర్తంలో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, మహాపూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి.



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న పురాణం మహేశ్వరశర్మ, భక్తులు

న్యూస్‌రీల్

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు గురువారం స్వామి వారికి ప్రాతరారాధన, పూర్ణాహుతి, రాములవారి గుండంలో స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. చక్రవర్తి తీర్థప్రసాద గోష్ఠ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



జనగామ రూరల్: ఆర్టీసీ జనగామ డిపోలో నేడు (శుక్రవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘన్‌పూర్, నర్మెట్ట, తరిగొప్పుల, రఘునాథపల్లి, మద్దూర్, పాలకుర్తి మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఫోన్ చేయాలని తెలిపారు. ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలకు సంబంధించి సమస్యలతోపాటుగా సూచనలు సలహాలను తెలిపేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు 99592 26050 ఫోన్ నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

గడువు పొడిగింపు

జనగామ రూరల్: అగ్ని వీర్ ఆన్‌లైన్ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత సైన్యంలో అన్ని కేటగిరీలలో జూనియర్ కమిషన్ ఆఫీసర్లు, ఇతర హోదాల నియామకం కోసం ఈ పరీక్షకు దరఖాస్తు గడువు మార్చి 12వ తేదీ నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు .

పార్టీని మరింత బలోపేతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేష్

జనగామ రూరల్: గ్రామస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేష్ కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మగంటి అనిల్‌గౌడ్ నేతృత్వంలో బస్తీ చలో.. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జూబ్లీ గార్డెన్స్‌లో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను చైతన్యపర్చాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు లక్ష్మీనర్సయ్య, దేవర ఎల్లయ్య, కార్తీక్‌తేజ, బింగి రమేష్, అశోక్, చంద్రయ్య, జగదీష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆహ్వానం



సోమయ్య

దేవరుప్పుల : తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో మే 8వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తలపెట్టిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో కవితా గానం చేసేందుకు మండల కేంద్రానికి చెందిన సామాజిక కవి, రచయిత అంకాల సోమయ్యకు భాషా చైతన్యసమితి అధ్యక్షులు బడేసాబ్ గురువారం ఆహ్వానం పంపించారు. సోమయ్య ఎంపికపై జనగామ రచయితల సంఘం అధ్యక్షుడు అయిలా సోమనరసింహాచారి, కవులు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో నేడు పూలే జయంతి

జనగామ రూరల్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ అధికారి రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తానేదార్‌పల్లి గ్రామస్తులు చాలా అదృష్టవంతులని, జనవరిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను ఈ గ్రామంలోనే ప్రారంభించినట్లు తెలిపారు. ఆయా సంక్షేమ పథకాల విషయంలో అధికారులు అప్రమత్తంగా, బాధ్యతగా పనిచేయాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుభరోసాతో పాటు సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీఆర్‌డీఏ వసంత, డీఏఓ రామారావు నాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, డీఎం సీఎస్ హతీరాం, గృహనిర్మాణ పీడీ మాత్రునాయక్, ఎంపీడీఓ విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఎం కుమారస్వామి, నాయకులు వెంకన్న, ఇంద్రారెడ్డి, పద్మారెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మండలంలోని విశ్వనాథపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి గురువారం ప్రారంభించారు.



తానేదార్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

అవినీతి రహిత పాలనే లక్ష్యం

అవినీతి రహిత పాలనే లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతికి సంఘాలు కృషి చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్: సహకార సంఘాలు ప్రజల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సహకార సంఘాల కార్యకలాపాల పనితీరును అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సహకార సంఘాల పరిధిలోని వివిధ వృత్తి కుటుంబాలను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతుసేవా సహకార సంఘాలు, పాల ఉత్పత్తుల సహకార సంఘాలు, మత్స్యసహకార సంఘాలు, కల్లుగీత కార్మిక సంఘాల ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత సేవలందించడానికి మరిన్ని సహకార సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. రైతు ఉత్పత్తి కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను అధికారులతో సమీక్షిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. మత్స్యసహకార సంఘాలు, పాల ఉత్పత్తుల సహకార సంఘాలు తమ వ్యాపార పరిధిని పెంచుకొని సంబంధిత వృత్తి గ్రామీణ ప్రజలకు మరింత సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత, జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, పశుసంవర్ధన శాఖ అధికారి రాధాకిషన్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, విజయడైరీ అధికారి సత్యనారాయణ, డీసీసీబీ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, పాల్గొన్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా అధికారులు చూడాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. భూమిపూజ ఎప్పుడు చేశారు, మొరం, ఇసుక ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారని ఆరాతీశారు. కాగా, అక్కడే ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వెంకన్న మాట్లాడుతూ.. ఇసుకతో సమస్య ఉందని, గోదావరి ఇసుక కొనాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, లోకల్ ఇసుకకు అనుమతి ఇవ్వాలని లబ్ధిదారుల పక్షాన కోరారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తహసీల్దార్‌కు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాల్లో నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా అధికారులు బాధ్యతగా పనిచేస్తూ లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ పీడీ మాత్రునాయక్, ఎంపీడీఓ విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, నాయకులు మంతెన ఇంద్రారెడ్డి, పద్మారెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దొడ్డువడ్లకూ బోనస్ ఇవ్వాలి



నర్మెట: వాగ్వాదం చేసుకుంటున్న మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్.. కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేట : కేసిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట/బచ్చన్నపేట/తరిగొప్పుల/జనగామ రూరల్: దొడ్డు ధాన్యానికి సైతం తెలంగాణ ప్రభుత్వం బోనస్ అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నర్మెట మండలంలోని హన్మంతాపురం, బొమ్మకూర్, మల్కపేట, మచ్చుపహాడ్, అమ్మాపురం, వెల్దండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాగా మల్కపేట, మచ్చుపహాడ్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డిపల్లి, కొడవటూర్, తరిగొప్పుల మండలంలోని అబ్దుల్‌నాగారం, అక్కరాజుపల్లి, పోతారం, జనగామ మండలం పెంబర్తి, పెద్దపహడ్, అడవికేశవాపూర్, ఎర్రగొల్లపహడ్ వెంకిర్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. దేవాదుల మూడో ఫేజ్‌లో రూ.1,600 కోట్లతో 1,800 క్యూసెక్కుల నీటి పంపిణీకి కేసీఆర్ ప్రభుత్వం 2014లోనే పనులు ప్రారంభించిందన్నారు. ఎమ్మెల్యే రాక ఆలస్యం కావడంతో హన్మంతాపూర్, బొమ్మకూర్‌లో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ స్వేత, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డితో కలసి కేంద్రాలను ప్రారంభించడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. సీఐ అబ్బయ్య, ఎస్సై నగేశ్ ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఆయా కార్యక్రమాల్లో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్వేత, నర్మెట తహసీల్దార్ రామానుజాచార్యులు, ఎంపీడీఓ అరవింద్ చౌదరి, ఏఓ మనోహిత్ విక్రమ్‌రావు, ఏపీఎం రవి, సీసీలు యాదగిరి, కవిత, కు మార్, నాయకులు నర్సింగారావు, రాజిరెడ్డి, తేజావత్ గోవర్ధన్, శ్రీనివాస్, గౌస్, లక్ష్మీనారాయణ, లక్ష్మి, అంజయ్య, బచ్చన్నపేటలో పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీఈఓ బాలస్వామి, రూపాచైతన్య, అనిల్‌రాజ్, తరిగొప్పుల తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఏపీఎం విజయ, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అర్జుల సంపత్‌రెడ్డి, చిలువేరు లింగం, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, సంజీవ, సుదర్శన్‌గౌడ్, రామరాజు, మహేందర్, సంపత్, బీమయ్య, రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, నిమ్మతి మహేందర్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి, మేకల కళింగరాజు, ప్రమోద్‌రెడ్డి, ప్రేమలత రెడ్డి, శ్రీనివాస్, నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణనాయక్, రాజమౌళి, రాంమ్మోహన్, భాస్కర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడికి ప్రభుత్వమే వైద్యం అందించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

రఘునాథపల్లి: విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మేకలగట్టు పంచాయతీ కార్మికుడు వేల్పుల నాగరాజుకు ప్రభుత్వమే పూర్తి వైద్య ఖర్చులు భరించి మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన గ్రామంలో వీధిలైట్లు వేస్తూ నాగరాజు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అధికారులు పట్టించుకోక పోవడాన్ని నిరసిస్తూ మండలంలోని పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్న నాగరాజుకు ప్రభుత్వం వైద్య సేవలు అందించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఉమ్మగోని రాజేష్‌గౌడ్, మహేందర్, రాపోలు రాజ్‌కుమార్, సత్యనారాయణ, కొయ్యడ బిక్షపతి, నల్ల రాజన్న, ఎండీ అజ్మత్, ప్రభాకర్, నీలం మధు, యాదలక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలి

- కురుమలకు సహకారం అందిస్తాం
- నెల్లుట్లలో బీరప్పగుడి నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కడియం

లింగాలఘణపురం: కురుమలు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని నెల్లుట్లలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూమిపూజ చేశారు. అనంతరం ఆలేరు ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కురుమ సామాజిక వర్గానికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను గొర్రెల మేపడం, వ్యవసాయ పనులకు పంపించారని, దీంతో ఎదగలేకపోయారని అన్నారు. నేడు కురుమలు డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అవుతున్నారని, అదేవిధంగా రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని, తాను ఎమ్మెల్యేగా గెలువడానికి కురుమ కులస్తులు ఎంతో కృషి చేశారని అన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలయ నిర్మాణానికి సహకారం చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కురుమలు నమ్మకానికి, నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలిచారని అన్నారు. నియోజకవర్గంలో కురుమలకు తగిన స్థానం కల్పిస్తానని చెప్పారు. అదేవిధంగా బీరప్పగుడి సమీపంలోనే రూ.20 లక్షలతో కురుమ భవనం నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమాల్లో కురుమ సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ సంపత్, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, లింగాల దీపక్‌రెడ్డి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, అంజనేయులు, సంపత్, మల్లేశం, ఐలయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే భర్తీ

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

జనగామ: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే భర్తీ చేయడం జరుగుతుందని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 33 ఉద్యోగ పోస్టుల భర్తీ కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి గత నెల 24 నుంచి 29 వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. డబ్బులు తీసుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తామనే అపరిచిత వ్యక్తుల ప్రలోభాలకు గురి కావొద్దని తెలిపారు. అలాంటి సంఘటనలు జరిగితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతే కాకుండా ఏసీబీ–1064, సైబర్ క్రైం–నేషనల్ హెల్ప్‌లైన్ –1930 నంబర్ల ద్వారా సైతం ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

క్లుప్తంగా

నకిలీ వైద్యుడిపై కేసు నమోదు



ఆప్టికల్స్ షాపును పరిశీలిస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు

ఎంజీఎం : నగరంలోని జేపీఎన్ రోడ్డులోని డెక్కన్ ఆప్టికల్స్ యజమాని ఎం.జనార్దన్ కంటి వైద్యుడిగా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు గుర్తించినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజాసంబంధాల కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు నకిలీ వైద్యుడు ఎం.జనార్దన్‌పై కౌన్సిల్ రిజిస్ట్రార్ డి.లాలయ్యకుమార్, చైర్మన్ కె.మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసినట్లు నరేశ్ తెలిపారు. ఆప్టోమెట్రిస్టులు, సహాయకులు రెఫ్రాక్షన్ సేవలు (కంటి డిగ్రీలు కొలవడం) మాత్రమే చేయాలన్నారు. కానీ వైద్య సలహాలు ఇవ్వడం, కంటి వ్యాధులకు మందులు సూచించడం లేదా శస్త్ర చికిత్సల పేరుతో మోసం చేయడం చట్టవిరుద్ధమని వివరించారు. ఇలా ఎలాంటి అర్హత లేకుండా వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ వైద్యుల బారిన పడితే పోలీసులు లేదా మెడికల్ కౌన్సిల్‌కుantiquackerytmc@onlinetsnc.in మెయిల్ ద్వారా లేదా 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

దామెర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని పోచమ్మకుంట నగరవీధికి చెందిన వేముల మల్లేశం(46) తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మండలకేంద్రంలో ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం కూలీ పనికి వచ్చాడు. మధ్యాహ్న సమయంలో పనులు చేసుకుంటూ కళ్లు తిరుగుతున్నాయని పక్కకు వెళ్లి కూర్చొని కుప్పకూలాడు. దీంతో స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

వాగులో పడి వృద్ధుడు..

శాయంపేట: మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల రాజమొగిలి (85) గురువారం వాగులో పడి మృతి చెందాడు. రాజమొగిలి మతిస్థిమితం కోల్పోయి ఇంటి వద్దే ఉంటున్నాడు. రాజమొగిలికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె. గతంలో అతడి భార్య మృతి చెందగా.. రాజమొగిలి కొడుకుల వద్దే ఉంటున్నాడు. గురువారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఆయన కుమారులు వెతకగా.. మండలంలోని గట్లకానిపర్తి శివారులోని వాగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సముద్రాల గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే పరీక్షలు నిర్వహిస్తాం
- ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల స్పష్టీకరణ
- పరీక్షలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ముడిపెట్టొద్దు : రిజిస్ట్రార్
- విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసులు చేసినా యూనివర్సిటీకి చెల్లించని ప్రైవేట్ యాజమాన్యాలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ వొకేషనల్ తదితర కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించాలని పరీక్షల విభాగం అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే అయా పరీక్షలు నిర్వహణకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సిద్ధంగా లేవు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, అందుకే తాము ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు నిర్వహించబోమని కొద్దిరోజుల క్రితమే సంఘం బాధ్యులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరీక్షల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షలు జరుగుతాయా లేదా అనే అంశంపై ఆందోళన చెందుతున్నారు.

5న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ సమావేశం

ఈనెల 5న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సమావేశం నిర్వహించుకున్నాయి. ఇందులో పలు తీర్మానాలు చేసుకున్నాయని సమాచారం. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి అలాగే ఉంచుకోవాలని, యూనివర్సిటీకి ఎప్పుడు చెల్లించాలని నిర్ణయిస్తే అప్పుడు వెంటనే చెల్లించాలని, ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాలను నామినల్ రోల్స్(ఎన్ఆర్)లో ఎంటర్ చేయాలని నిర్ణయించాయి.

1, 3, 5వ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించేందుకు..

కేయూ పరిధిలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు గత నెల 4న విడుదలైన విషయం విధితమే. అప్పట్లో యూనివర్సిటీ అకడమిక్ డీన్ విభాగానికి చెల్లించాల్సిన వివిధ రకాల ఫీజులు చెల్లించని కాలేజీల ఫలితాలు నిలిపిన విషయం విధితమే. ఆ తర్వాత ఎక్కువ శాతం కళాశాలలు చెల్లించినా ఆయా ఫీజులు 40కిపైగా కాలేజీలు చెల్లించలేదు. అయినా అన్ని కళాశాలల విద్యార్థుల ఫలితాలను చివరికి అధికారులు విడుదల చేశారు. నాలుగైదు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఫీజులు చెల్లించకపోయినా పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. అయితే ఆ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువ ఉండడంతో మళ్లీ ఆయా పరీక్షలు నిర్వహించేందుకు, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువు ఇచ్చారు. అపరాధ రుసుములేకుండా ఈనెల 11తో ముగియబోతుంది. ఆ పరీక్ష ఫీజులు కూడా విద్యార్థుల నుంచి ప్రైవేట్ యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఈ ఫీజులు కూడా యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లిస్తే డిగ్రీ 2,4,6 సెమిస్టర్లతోపాటే 1,3,5 సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించాలనే యోచనలో పరీక్షల విభాగం అధికారులున్నారు.

73 కళాశాలల వరకే పరీక్ష ఫీజులు చెల్లింపులు..

కేయూ పరిధిలో 292 వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాలు, అటానమస్ డిగ్రీ కళాశాలలున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫీజులు చెల్లించేందుకు అధికారులు ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 9వతేదీతో గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు అన్ని యాజమాన్యాలు కలిపి కేవలం 73 కళాశాలల వరకే యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి ఫీజులు చెల్లించాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజులు వసూలు చేశారు. కానీ ఆ యాజమాన్యాలు గురువారం వరకు యూనివర్సిటీకి చెల్లించలేదు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ ఈ విద్యార్థుల పరీక్షల ఫీజులు యూనివర్సిటీకి చెల్లించొద్దని, పరీక్షలను కూడా నిర్వహించబోమని నిర్ణయంచుకున్నాయి. దీంతో వేలాది మంది విద్యార్థులు రాసే పరీక్షల నిర్వహణపై ప్రతిష్టంభన ఏర్పడింది.

పరీక్షల ఫీజు చెల్లించాలి



కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించేందుకు ఆ విభాగం సిద్ధంగా ఉంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు యూనివర్సిటీ పరీక్షల విభాగానికి చెల్లించాల్సింటుంది. ఇంకా చెల్లించడం లేదు. ఫీజులు చెల్లించిన కాలేజీల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తాం. ఎందుకంటే ఫైనలియర్ విద్యార్థులకు ఇబ్బంది ఉంటుంది కాబట్టి. పరీక్ష నిర్వహణ ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ముడిపెట్టొద్దు.

-ఆచార్య రామచంద్రం, రిజిస్ట్రార్, కేయూ

తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభాస్థలి పరిశీలిన



బహిరంగ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి: తెలంగాణ వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నడూ కొట్లాడిందిలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపాన ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభాస్థలిని ఆయన గురువారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ సుమారు 1,200 ఎకరాల స్థలంలో సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు నాలుగు వైపులా రూట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సంవత్సరంన్నర కాంగ్రెస్ పరిపాలన అట్టర్‌ప్లాప్ అయిందని, ఆ పార్టీని గెలిపించి మోసపోయామని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. నీళ్లు లేవు.. పెట్టుబడిలేదు.. కరెంటు లేదు.. కళ్యాణలక్ష్మి లేదు.. కేసీఆర్ కిట్టు లేదు.. తండాలకు రోడ్లు లేవన్న విషయాన్ని ప్రజలు రివ్యూ చేసుకుంటున్నారని తెలిపారు. నీళ్ల లేక పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను చూడాలే.. ఆయనకు ధైర్యం చెప్పాలన్న కుతుహలంతో ఎదురుచూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాగుర్ల వెంకన్న, సదానందం, పిట్టల మహేందర్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, తంగెడ మహేందర్, జూపాక జడ్సన్ పాల్గొన్నారు.

కేయూ బంద్ విజయవంతం



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- అక్రమ అరెస్టులను నిరసిస్తూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌చేసి 21జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యామండలి ముట్టడికి పిలుపునివ్వగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విధితమే. దీనికి నిరసనగా గురువారం కేయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన బంద్ విజయవంతమైంది. క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం, పరీక్షల విభాగం, ఆడిట్, యూజీసీ తదితర కీలక విభాగాలన్నింటినీ బంద్ చేయించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలను కూడా బంద్ చేయించారు. అనంతరం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు పి. కరుణాకర్‌రావు, సాధురాజేశ్, శ్రీధర్‌కుమార్‌లోథ్, బి.సతీశ్, మాదాసి కనకయ్య మాట్లాడుతూ కొన్నేళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్‌చేయాలన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాకే కొత్తగా అధ్యాపక పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కాగా, రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆశీర్వాదం, సంకినేని వెంకట్, భిక్షపతి, రవీందర్, గద్దం కృష్ణ, జూలసత్య, నాగయ్య, సూర్యనారాయణ, కవిత, శ్రీదేవి, స్వప్న, వీణ, సునీత, ఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



సంజయ్‌కుమార్ (ఫైల్)

కాజీపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట భవానీనగర్‌కు చెందిన ఊరడి సంజయ్ కుమార్(26) సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వర్తిన్నాడు. ఈ క్రమంలో ఇటీవల రూ. 76 లక్షలతో ఇదే కాలనీలో నూతన ఇంటిని కొనుగోలు చేశాడు. ఇంటి రిజిస్ట్రేషన్ తదితర ఖర్చులు అధికం కావడంతో అప్పులు పెరిగాయి. అప్పులు, వడ్డీలు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన సంజయ్‌కుమార్..బాపూజీనగర్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

వడ్డేపల్లి చెరువులో పడి నిట్ విద్యార్థి..



రిత్విక్‌సాయి మృతదేహం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో నిట్ వరంగల్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రుత్విక్ సాయి(23) నిట్ వరంగల్‌లో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం ఆ యువకుడి మృతదేహం చెరువులో తేలియాడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, రిత్విక్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

పిడుగు పాటుకు పశువుల మృత్యువాత



మృత్యువాత పడిన పశువుల వద్ద రోదిస్తున్న రైతు ఎల్లయ్య

బచ్చన్నపేట : పిడుగుపాటుకు మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని కట్కూర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రికింది ఎల్లయ్య బుధవారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద రెండు ఎడ్లు, ఓ పాడి గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం ఈదురుగాలులతో పాటు పిడుగులు పడ్డాయి. దీంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా మూడు పశువులు మృత్యువాత పడి కనిపించగా బోరున విలపించాడు. ఈ ఘటనలో దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, బాధిత రైతు ఎల్లయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

కవి.. కష్టజీవి పక్షానే ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, అరసం బాధ్యులు

విద్యారణ్యపురి: కవి ఎప్పుడూ కష్టజీవి పక్షానే ఉండాలని, ప్రజలను చైతన్యవంతం చేసేలా రచనలు ఉండాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. బుధవారం రాత్రి అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం)90వ ఆవిర్భావ దినోత్సవం హనుమకొండలోని ఆదర్శ 'లా' కాలేజీలో నిర్వహించారు. ఈ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహించారు. అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో బ్రిటిష్ వలసవాదం, దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు లక్నోలో 1936 ఏప్రిల్ 9,10తేదీల్లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు అయిందన్నారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ మాట్లాడుతూ దేశంలో నాడు ఏ పరిస్థితులున్నాయో ఇప్పటికీ అవే పరిస్థితులు ఉన్నాయన్నారు. అణిచివేత కొనసాగుతోందన్నారు. అనంతరం పల్లేరు వీరస్వామి రచించిన 'వీక్షణాలు', కేవీఎల్ రచించిన 'లింగమ్మ' పుస్తకాన్ని అంపశయ్య నవీన్ , ప్రముఖ కవి బన్న అయిలయ్య ఆవిష్కరించారు. అరసం ఉపాధ్యక్షురాలు చందనాలసుమిత్ర పుస్తక సమీక్ష చేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి రజిత, బాధ్యులు మార్క్‌శంకర్‌నారాయణ, నిధి, బూర భిక్షపతి, బూర విద్యాసాగర్, పాంచల్ రాయ్ మాట్లాడారు. న్యాయవాది ఏరుకొండ జయశంకర్, హనుమకొండ భారత్‌బచావో చైర్మన్‌రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ ఇంటికి వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వృద్ధుడి దుర్మరణం
- వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఘటన
- నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లిలో విషాదం



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖిలా వరంగల్ : కొత్త వాహనానికి రిజిస్ట్రేషన్ పూర్తయింది. అదే వాహనంపై బిడ్డ ఇంటికి వెళ్తూ ఓ వృద్ధుడు మృత్యుఒడికి చేరాడు. రోడ్డు ప్రమాదంలో దర్మరణం చెందాడు. ఈ ఘటన వరంగల్ హంటర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పావులూరి వెంకటేశ్వర్లు (60) పర్వతగిరి మండల కేంద్రంలో నివాసముంటూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కొత్త బైక్‌ను కొనుగోలు చేశాడు. గురువారం ఉదయం వాహన రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి చేరుకున్నాడు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే మధ్యాహ్నం హనుమకొండలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద టిప్పర్ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలియడంతో స్వగ్రామం సాయిరెడ్డిపల్లి, ప్రస్తుతం ఉంటున్న పర్వతగిరి మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుమార్తె బొర్ర కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. బావిలో శవమై కనిపించి

- అనుమానాస్పదస్థితిలో వ్యాపారి మృతి
- చిన్నముప్పారంలో ఘటన



కిశోర్ (ఫైల్)

నెల్లికుదురు: ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యాపారి అనుమానాస్పదస్థితిలో వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. ఈ ఘటన గురువారం ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓబిలిశెట్టి కిశోర్ (40) కిరాణ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు కిశోర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కట్ల ఐలయ్య వ్యవసాయ బావివద్ద కిశోర్ వాహనం కనిపించింది. దీంతో వ్యవసాయ బావిలో చూడగా మృతి చెంది శవమై కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, కిశోర్ మృతికి కుటుంబ కలహాల లేదా.. మరే ఇతర కారణమా అనే విషయం తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

పీజీ కోర్సుల పరీక్షలు వాయిదా వేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు టైంటేబుల్‌ను కూడా ఇటీవల వెల్లడించారు. అయితే, పలువురు విద్యార్థులు ఆయా పరీక్షలు వాయిదా వేయాలని పరీక్షల విభాగం అధికారులకు గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగం అధికారులు మాట్లాడుతూ సకాలంలో పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలను కూడా త్వరగా వెల్లడించే వీలుంటుందని, టైంటేబుల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈక్రమంలో పరీక్షలు వాయిదా వేయాల్సిందేనని విద్యార్థులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

నేటి నుంచి లలితాయాగం



రాజరాజేశ్వరి దేవి అమ్మవారు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం నుంచి నాలుగురోజుల పాటు లలితా యాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి పూర్వాంగం, అగ్నిప్రతిష్ట, తిథి నిత్య హోమాలు, లలితా హోమం, రాత్రి 8గంటలకు దశ విధహారాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. రోజూ హోమం జరుగుతుందని తెలిపారు. సోమవారం హోమం మహాపూర్ణాహుతి జరుగుతుందని వివరించారు.

పశుదాణాకు ప్రత్యామ్నాయం.. 'అజొల్లా'





అజొల్లా తయారీ విధానం



అజొల్లాను తింటున్న కోళ్లు, పశువులు

- వేసవిలో పాడి పశువులకు దాణాగా వాడొచ్చు
- ఈ మొక్కలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్ అధికం

మహబూబాబాద్ రూరల్ : అజొల్లా.. ఆకుపచ్చ రంగులో ఉండే ఫెర్న్ జాతికి చెందిన మొక్క. దీనిలో మాంసకృత్తులు, లవణాలు, కెరోటిన్, విటమిన్ బీ2 ఎక్కువ ఉంటాయి. ఇది తక్కువ శాతం లిగ్నిన్ కలిగి సులభంగా జీర్ణమవుతుంది. అజొల్లా వాడకం వల్ల పశుదాణా ఖర్చుల్లో 20 నుంచి 25 శాతం తగ్గించొచ్చు.

- వెన్నశాతం, ఎస్ఎన్ఎఫ్ విలువలు పాలలో పెరుగుతాయి. దీంతో లీటర్ పాలకు రూ.60 పైసల నుంచి రూ. 1.50 వరకు అధిక ఆదాయం పొందొచ్చు.
- అజొల్లాను పాడి పశువులకే కాక గొర్రెలు, కోళ్ల మేతలో కూడా దాణాకు ప్రత్యామ్నాయంగా (బదులు) వాడొచ్చు.
- లూజ్ అజొల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాతో కలిపి వాడొచ్చు. అజొల్లాను ఏ ఇతర పదార్థాలతో కలపకుండా కూడా దాణాగా వాడొచ్చు.

అజొల్లా తయారీ విధానం..

- రోజుకు 4 కిలోల అజొల్లా ఉత్పత్తి చేయడానికి 2.25 X 1.5 మీటర్ల కొలతలతో తొట్టి తయారు చేసుకోవాలి. (2.25 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు), 9 అంగుళాల లోతు.
- 150 జీసీఎం మందం, 2.5 X 1.8 మీటర్ల సైజ్ గల సిల్పాలిన్ (షీట్) తొట్టిలో పరచాలి.
- 10 నుంచి 15 కిలోల సారవంతమైన మట్టిని సమానంగా పాలిథీన్ షీట్‌పై పరచాలి. తర్వాత 2 నుంచి 5 కిలోల, రెండు రోజుల ఆరిన పేడ 40 గ్రాములు, సూపర్ పాస్పేట్ 10 లీటర్ల నీటిలో కలిపి ఆ మిశ్రమాన్ని గుంతలో పోసి బాగా కలిపి పెట్టాలి.
- తొట్టిలో 7 నుంచి 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకు నీరు ఉండేలా చూసుకోవాలి.
- 0.5 కిలోల నుంచి 1 కిలో అజొల్లా మదర్ కల్చర్‌ను గుంత అంతా సమానంగా చేయాలి. వేసిన వారం రోజులకు అజొల్లా గుంత అంతా అభివృద్ధి చెందుతుంది.
- కిలో అజొల్లా మదర్ కల్చర్ నుంచి వారం రోజుల్లో 8 నుంచి 10 కిలోల దిగుబడి వస్తుంది. ఏడో రోజు నుంచి అజొల్లాను ప్రతీరోజు వాడుకోవచ్చు.
- వారానికి ఒకసారి కిలో పేడను, 20 గ్రాముల లవ మిశ్రమాన్ని 5 లీటర్ల నీటితో గుజ్జుగా కలిపి తొట్టిలో వేయాలి.
- అజొల్లా పెంచడానికి ప్రత్యేకంగా స్థలం లేనివారు పండ్ల తోటలు, వాటిలో తొట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా షెడ్‌నెట్ల కింద నిర్మించుకోవచ్చు.
- ఉష్ణోగ్రత 20 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్య ఉండాలి. సూర్యరశ్మి నేరుగా పడకుండా ఆకులు చెత్త గుంతలో పడకుండా షెడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలి.
- తొట్టిలో తేలియాడుతున్న అజొల్లాను ప్లాస్టిక్ జల్లెడతో బయటకు తీయాలి. తొలుత వారం రోజులకు తర్వాత ప్రతీరోజు అజొల్లా సేకరించొచ్చు. తొట్టి నుంచి తీసిన అజొల్లాను మంచి నీటితో కడిగితే పేడ వాసన రాదు.

అజొల్లాలో ఉండే పోషకాలు..

- అజొల్లా డ్రై వెయిట్ బేసిస్ ప్రకారం 25 నుంచి 30 శాతం మాంసకృత్తులు, 10 నుంచి 15 శాతం మినరల్స్, 7 నుంచి 10 శాతం అమైనా ఆసిడ్స్, బయోమాక్టిల్ పదార్థాలు ఉంటాయి.
- ఎక్కువ మాంసకృత్తులు, తక్కువ లిగ్నిన్ ఉండడం వల్ల వేగంగా, తేలికగా, తక్కువ ఖర్చుతో పెరుగుతుంది. దీని వల్ల దీనిలోని పోషకాలను పశువులు, కోళ్లు, గొర్రెలు తేలికగా జీర్ణం చేసుకుంటాయి.
- అజొల్లా గురించి మరింత సమాచారం కోసం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్. కిశోర్‌కుమార్ సెల్ నంబర్ 99594 66904ను సంప్రదించొచ్చు.